

# డబ్బిచ్చి అమ్మేస్తున్నాం

డా. సోమిరెడ్డి జయప్రద

'అమ్మా!'

మంచంమీద ముడుచుకుని పడుకుని దగ్గుతున్న వైశాలి కళ్లు మెరిశాయి. హఠాత్తుగా కొన్ని టన్నుల బలం తన శరీరంలోకొచ్చినట్టయి చటుక్కున లేచి కూర్చుందామె.

ఎంతకాలమైంది సాహితిని చూసి!

క్షణంలో ఆమె లెక్కలు కట్టుకుంది రెండేళ్ల తొమ్మిది నెలల పది రోజులైంది. పదకొండోరోజు లెక్కబెట్టకముందే సాహితి తనింటికొచ్చింది.

"అమ్మా! ఒంట్లో బాగాలేదా?" తల్లి దగ్గరకొచ్చింది సాహితి.

వెనకనే నిల్చుండిపోయాడు సాహితి భర్త సాకేత్. అతనికి గిల్టీగా ఉంది. ఇన్ని సంవత్సరాలు ఎన్నిసార్లడిగినా పుట్టింటికి పంపని భార్యను ఈరోజు తీసుకొచ్చాడు. అత్తగారు చేసిన పొరపాటుకు ఈవిధంగా తను ఆమెను శిక్షిస్తున్నాననుకున్నాడు. కానీ ఈరోజు ఆమె అవసరం... కేవలం ఆమె అవసరం మాత్రమే తనకొస్తుందనుకోలేదు. అన్ని రోజులూ తనవే అనుకున్నాడు.

"ఏమిటలా ఉన్నావమ్మా?"

"ఏమీ లేదు. అదే ... ఆ దగ్గే.... నీకు రాశాను కదా!"

"ఆఁ, రాశావు. తీరిక దొరకలేదు రావడానికి!"

నవ్వుకుంది వైశాలి. తీరిక చేసుకుని రావడానికి తను ఆ జాబు రాసి రోజులు కాదు, నెలలు కాదు సంవత్సరం అయింది! ఏమి చేయగలదు? కూతురిని కని పొరపాటు చేసి పాతిక సంవత్సరాలపైనే అయింది. ఆ పొరపాటును ఈ రోజు ఎలా దిద్దుకోగలదు?

ఇంతకీ తను చేసిన లోపం ఏమిటి?

ఆషాఢమాసానికి అల్లుడిని పిలవకుండా కూతురుని మాత్రం రమ్మంది. తనకు తెలిసినంతవరకూ ఆషాఢమాసానికి అల్లుడిని పిలవరు. పండక్కి కూతురికి చీర పెట్టి, అల్లుడికి అంత ఖరీదు చేయని బట్టలు పెట్టిందట! అదీ తన తప్పు! ఆ తర్వాత ఆ చిన్న తప్పుకు తను క్షమాపణ అడిగినా క్షమించే సంస్కారం అతనికి లేకపోయింది.

కట్నం చాలదని బేరమాడి అడిగి తీసుకున్న అల్లుడు, అత్తగారు ఇవ్వని ప్రాముఖ్యతను అడిగి చనువుగా తీసుకోలేకపోయాడు. నొచ్చుకున్నాడు. ఇరవై సంవత్సరాలు 'నాది' అని పెంచుకున్న కూతురిని తనకు దూరం చేశాడు. కూతురు మాత్రం

తక్కువదా? భర్త కోసం తల్లిని వదులుకుందిన్నాళ్లూ ....!

ఈరోజుకి.... పశ్చాత్తపమే కలిగిందో, భార్య కన్నీళ్లకి కరిగిపోయాడో! పోనీలే, ఏదో విధంగా తీసుకొచ్చారు. కళ్లారా చూసుకుంది.... అంతే చాలు!

"అమ్మా! నాకు గర్భం. డాక్టర్లు తొమ్మిది నెలలు విశ్రాంతి కావాలన్నారు. నీ దగ్గరుంధామని వచ్చాను!"

వైశాలి కళ్లల్లో దీపం ఆరిపోయింది. 'అంటే ... తన కూతురు తన కోసం రాలేదన్నమాట!' ఎంత నిర్దయులు ఈ బిడ్డలు? కనీసం కొద్దిగంటలైనా తనని ఆ భ్రాంతిలో ఉండనీయకుండా, తనొచ్చిన చేదు కారణాన్ని తనముందు అప్పుడే బద్దలుకొట్టాలా?

"అమ్మా! నీతో చెప్పలేదు బాధపడతావని. ఇది ఐదో గర్భం.... నాలుగూ ఎన్ని మందులు వాడినా నిలవలేదు. అందుకని పూర్తి రెస్ట్ కావాలన్నారు డాక్టర్లు. అక్కడ అత్తగారికి బాగాలేదు. నాకెవరు చేసిపెడతారు? అందుకే ఈయన 'మీ పుట్టింట్లో తొమ్మిది నెలలు ఉండి, రా!' అని తీసుకొచ్చారు."

తన కూతురు ఎంత కఠోరమైన నిజాన్ని చెప్తోంది! 'మా అవసరానికి నన్ను నీ దగ్గరికి మీ అల్లుడు తీసుకొచ్చాడు' అని ఎంత నిర్లజ్జగా చెప్తోంది! 'అమ్మా! నిన్ను చూడాలనిపించి ఈయనతో పోట్లాడి వచ్చా!' అని అబద్ధమాడి మనసు చల్లపరచవచ్చు కదా!

"అమ్మా! నా ఖర్మ కాకపోతే, ఇన్ని గర్భాలు ఎందుకు పోతాయి? ఈసారన్నా పూర్తి విశ్రాంతి తీసుకోకపోతే ఈ బిడ్డ కూడా దక్కదని డాక్టర్లు చెప్పారు."

"ఆహాఁ."

"మా అత్తగారు ఖచ్చితంగా చెప్పేశారు, తొమ్మిది నెలలు నన్ను కూర్చోబెట్టి చూడడం తల వల్ల కాదని! అమ్మా! నన్నీ ఆరు నెలలూ చూడలేవా?"

ఉలిక్కిపడింది వైశాలి. తన బిడ్డ తనని యాచిస్తోందా? తన కడుపులో బిడ్డను పెంచుకోవడానికి దయాభిక్ష అడుగుతోంది తన బిడ్డ! ఎంత చిత్రం! ఇద్దరు మగబిడ్డల తర్వాత వద్దనుకుంటే భూమ్మీద పడ్డ ఈ ఆడపిల్లను చూసి ఆనాడేమనుకుంది తను? మగపిల్లలు రెక్కలు వచ్చి ఎవరి దారిన వాళ్లు ఎగిరిపోతే, తనూ, తన భర్త ఈ ఆడపిల్లకు న్యాయం చేయగలరా అని అనుకుని కంపించిపోయింది.

అలాంటి తను.... అదే బిడ్డ ఆరు నెలలు ఆశ్రయం ఇవ్వడానికి ఎందుకు ఆలోచిస్తోంది? తన చేతిలో ఉన్న పనిని చేయడానికి వెనుకాడుతోంది? .... వయసు మీదపడి శరీరంలో శక్తి లేకా? లేక, తన కడుపున పుట్టిన ఈ బిడ్డ నిరాదరణకు తట్టుకోలేని ఈ మనసు ఎదురు తిరుగుతోందా? ఎందుకని?

"నీకు శ్రమ ఇస్తున్నానమ్మా!"

ఏమందీ... నాకు శ్రమ ఇస్తున్నానని కదూ! ఎంత పరాయి భావం! ఆ భావం ఎక్కడనుండి పుట్టింది? మెడలో పడిన పసుపుతాడులోంచా, తల్లి తనని నిశ్శబ్దంగా కాదంటున్న సత్యం తాలూకు నిస్సహాయతలోనుంచా? తల్లిని తనిన్నాళ్లూ నిర్లక్ష్యం చేశాననే గిల్టీ ఫీలింగ్ నుంచా?

"చిన్నీ!" వైశాలి పెదాలు ఉచ్చరించాయి.

సాహితి భయం మంచు తెరలా కరిగిపోయింది. సాహితి పెదాలమీద గుండె తేలికపడిన సూచనగా ఓ హాసరేఖ.

"వస్తానత్తయ్యా!"

"అలాగే.... అలాగే, నాయనా!"

అల్లుడు వెళ్లిపోయాక కానీ ఈ లోకంలో పడలేదు వైశాలి. 'అయ్యో, అల్లుడు వెళ్తానన్నప్పుడు ఉండమనలేదే?' ....!

000

"అమ్మా! నాకు బెడ్‌పాన్...!" డెబ్బయ్యేళ్ల ముసలి తల్లిని అర్ధరాత్రి లేపాల్సిన దుస్థితికి సిగ్గుపడుతూ పిలిచింది సాహితి.

కరిగిపోయిన కలలకు విరిగిపోయిన శిథిలాల్లాంటి కనురెప్పలమీద ఇప్పుడిప్పుడే వాలిన నిద్రా దేవత తుళ్లిపడింది.

"ఏమ్మా...?"

"అమ్మా! నాకు...."

"ఆఁ ఆఁ తెస్తున్నా!" కాళ్లమీద దుప్పటి తొలగించి లేవబోయిన వైశాలి కాళ్లకు చీరకుచ్చెళ్లు బంధాలు పడి ముందుకు వాలిపోయిందామె.

"అమ్మా!... లేవకు! నువ్వు లేవకు...! దెబ్బ తగిలిందా?"

"లేదులే, లైటు వెయ్యి! ఆఁ, వద్దొద్దు! నేను వేసుకుంటాను. నువ్వు లేవకు!" శరీరం బరువంతా ముంజేతిమీద వేసి లేవబోయిన వైశాలి లేకపోయింది.

"ఏమ్మా!" ఆత్రుతగా ముందుకు వంగిన కూతురి ముఖంలో భావాలు చదవడానికి ప్రయత్నించింది కానీ ఆ క్రీనీడలో ఆమెకు ఏ భావమూ కనిపించలేదు కానీ, ఆ వృద్ధురాలు కూతురిని చదవగలదు.

'ఈ ముసలి ప్రాణం మూలపడితే మరో దిక్కులేదు ఆ పిల్లకు! అందుకు తను కావాలి' అలా క్షణం అనిపించినా.... ఛ! ఛ! తను అలా అనుకోకూడదు. తన కూతురు తన ఆరోగ్యంకోసం కంగారుపడుతోంది... అనుకుని తృప్తిపడింది. కానీ గుండెల్లో ఏదో వెలితి.

లైటు వెలిగింది. వంగిన నడుమును సర్దుకుంటూ నిటారుగా నిలబడటానికి ప్రయత్నిస్తోన్న వైశాలి కాలు బెణికింది.

ఇన్నాళ్లూ ఈ దగ్గు దగ్గీ దగ్గీ ఇక దగ్గలేక, ఈ ఎండిపోయిన బతుకుని ఈడ్చలేక తనను కావాలనుకునే వాళ్లు ఎవరూ లేరని నిర్ణయించుకున్నాక మొన్నటికి మొన్న మొదటిసారిగా ఆత్మహత్య చేసుకావాలనుకుంది. తన భర్త తన నలభై ఐదవ ఏట పరమపదించి పుణ్యాత్ముడయ్యాడు. తన కెప్పుడు శాపవిమోచనం?

ఇంకా కొద్ది రోజులు గడిస్తే తన భర్త కట్టిన ఈ ఇంట్లో తనువు చాలించాలనే తన కోరిక తీరకముందే తన బిడ్డలు వచ్చి ఈ కొంపను కూడా పంచిమ్మని అడక్కముందే తను వెళ్లిపోవాలనుకుంది. ఈ భవబంధాలనుండి విముక్తి పొందాలనుకుంది. ఆ రోజే సాహిత్య తన వాకిటముందు కొచ్చి శిశుభిక్ష పెట్టమని కోరి తన కోరికకు కళ్లెం వేసింది!

బెడ్‌పాన్ తీసేటప్పుడు కొద్దిగా యూరిన్ బెడ్‌పై ఒలికింది. 'ఎంత బలహీనమైపోయాయి తన చేతులు! ....' వైశాలికి దిగులు ఆక్రమించుకంది.

"అమ్మా! చీర తడిసిపోయింది... మరో చీర!"

ఆ పిల్ల తల్లి దగ్గర స్వతంత్రాన్ని పూర్తిగా కోల్పోయింది ఈ రెండేళ్ల నిశ్శబ్దం సాహితిని క్షణక్షణం గిల్టీకాన్‌షెన్‌లో ముంచుతోంది.

బిడ్డ తాలూకు అసంపూర్ణ అభ్యర్థనతో కరిగిపోయింది వైశాలి. కుంటుకుంటూ వెళ్తున్న తల్లిని చూసి, అమ్మకు కూడా ఇప్పుడే ఇలా జరగాలా? అనుకుంది.

మనసులో మాటలు బయటకు అందించే మిషన్లు ఇంకా రాలేదు. అందుకే వైశాలి రక్షించబడింది మరో బాణం ఆమె మనసులో గుచ్చుకోకుండా!

ఐ ఐ ఐ

సాహితికి కడుపులో నొప్పిగా ఉంది. తల్లి గాఢనిద్రలో ఉంది. లేపడానికి చేతులు నిరాకరిస్తున్నాయి. 'అమ్మ ఏమనుకుంటుందో?' తల్లి కాదన్నా, మారంచేసి బాల్యంలో అన్నీ సమకూర్చుకున్న తన చేతులకు ఈనాడు ఎవరో బంధాలు వేసినట్టున్న భావం. ఆ బంధాలు వేసింది ఎవరో అయితే బాధ లేదు. ఆ అపరాధం తనది! ఆ హక్కు తను పోగొట్టుకుంది. దానిక్కారణం తన భర్తే కావచ్చు. తను మాత్రం కన్నతల్లిని తక్కువ నిర్లక్ష్యం చేసిందా? ఈ రెండు సంవత్సరాలూ భర్తదే లోకం, భర్తే దైవం.... ఈనాడు తల్లి అవసరం వస్తే కానీ, ఆమెను తను మానసికంగా పోగొట్టుకున్న సత్యం అర్థం కాలేదు.

తల్లిని లేపలేక తప్పలేదు. తుళ్లిపడ్డట్టు లేచి కూర్చుంది వైశాలి. వద్దని విసిరేసుకుంటున్నా ఆమె పేగు కదులుతూనే ఉంది. సాహితి పిలిచిన పిలుపులో ఏదో అశుభం ధ్వనించిందామెకు.

"ఏమైంది సాహితీ? ఏమయిందమ్మా?"

## అడ్వాన్స్ బుకింగ్

వ్యాపారి: మీకు నాతో అపాయింట్‌మెంట్ కావలసివస్తే ముందు నా సెక్రటరీని కలియాలి.

సేల్స్‌మన్: ఆ విషయం తెలుసు. కాని, ఆవిడ ఇప్పటికే రెండువారాలకి ముందుగా బుక్ అయిపోయింది.

-కె.ఆర్.కె. మోహన్, హైదరాబాదు

"కడుపులో నొప్పిగా ఉందమ్మా. పక్కింటి ఆంటీని కొద్దిగా డాక్టరుకు ఫోన్ చేయుమని చెప్తావా?"

"వాళ్లు ఊరెళ్లినట్టున్నారు. ఐదిళ్లవతలే ఒక కొత్త లేడీ డాక్టరు వచ్చి చేరిందట. నే వెళ్లి పిలుచుకువస్తాను. బయట తాళం వేసి వెళ్తా, భయపడకు!"

'పాపం, అమ్మ! తన అత్తగారు అమ్మ కంటే ఆరోగ్యంగానే ఉంది. ఆమె చూసుండొచ్చు తనని' అలా అనుకున్న సాహితిలో మరో ఆలోచన 'తన కోడలికి ఇలా చేయాల్సి వస్తే అమ్మ చేసుండేదా? ... చేసుండేదేమో! వదినలు అమ్మని బాగా చూస్తారు, అన్నలు పట్టించుకోకపోయినా. మరి తను మాత్రం అత్తను బాగా చూడటంలేదా?'అని నిట్టూర్చి మరలా దిగులుపడసాగింది.

ఈ గర్భం అయినా ఉంటుందో, ఉండదో! తనకు తల్లయ్యే ప్రాప్తం ఉందో, లేదో?.... ఇలా రకరకాలుగా ఆలోచించి దిగులుపడుతున్న సాహితికి బయట గొళ్లెం చప్పుడు వినిపించింది. క్షణం భయం అనిపించింది.

వాకిట్లో తల్లిని చూడగానే ధైర్యం వచ్చింది. డాక్టరు సాహితిని పరీక్ష చేసి "ఏమీ లేదు, మామూలు కడుపు నొప్పే! రేపు ఈ మాత్రలు తెప్పించి వాడండి!" అని నొప్పి తగ్గటానికి ఒక మాత్ర ఇచ్చి, ధైర్యం చెప్పి వెళ్లింది.

000

నిద్రపోతున్న వైశాలి కలవరపడ్డట్టు లేచింది. ఆమె మస్తిష్కంలో ఎక్కడో ఏదో బాధాతప్త శబ్దం! అదే నిజమైంది ...

సాహితికి నొప్పులొస్తున్నాయి. ఆమె తెల్లవారేదాకా ఓదార్చుకోడానికి ప్రయత్నిస్తోంది. 'ఈ అర్ధరాత్రి తల్లిని లేపి బాధపెట్టే హక్కు తనకు లేదు. ఒకవేళ అమ్మ తనను క్షమించినా, తన భర్త తన తల్లిని క్షమించడు. ఇన్ని నెలలు ఆమె శ్రమను, సుఖాన్ని ఖర్చు చేసి తను తల్లి అయి ఈ గడప దాటిన మరుక్షణం ఈ ఇల్లు తనకు పరాయిది. తన భర్త మళ్లీ తనను ఇక్కడకు పంపడు!'

"ఏమ్మా, సాహితీ! నొప్పులా? నన్ను లేపకపోయావా? అమ్మో! ఎంతసేపటి నుండి బాధపడుతున్నావో ... మొద్దునిద్ర పట్టేసింది ఏనాడూ లేనిది!"

"ఫర్వాలేదమ్మా, ఇప్పుడేలే! పొద్దున్నే వెళ్దాంలే!"

"అయితే మాత్రం.... అలస్యం చేస్తే ఆ తర్వాత ఏమైనా అయితే .... మీ వాళ్లు ...."

'నీకు కొత్తగా వచ్చే నష్టం ఏమీ లేదమ్మా! శుభం జరిగినా, అశుభం జరిగినా మా ఇంటి తలుపులు నీ కోసం ఎప్పుడూ తెరిచి ఉండవు' మనసులో నిట్టూర్చింది సాహితి. ఈ ఆరు నెలలూ తల్లి తన కోసం పడిన ఆరాటం చూశాక సాహితిలోని స్వార్థపు తెర తొలగిపోయింది.

"అమ్మా! మీ అల్లుడిచ్చిన డబ్బయిపోయింది. రేపు టెలిగ్రాం ఇస్తాను. ఈ లోపల నీ దగ్గర కొద్దిగా అయినా ఉందా?" సిగ్గుతో చితికిపోతూ అడిగింది సాహితి.

అసలు వైశాలి చేయాల్సిన కాన్పు ఇది. సంప్రదాయపు హక్కును కూడా పోగొట్టుకుంది సాహితి.

"ఛ! అవేం మాటలే! ఈ ఆరు నెలల్లో ఇంటి బాగుడల్లో నీ కానుపుకని కూడబెట్టిన డబ్బు సరిపోతుందిలే, తర్వాత సంగతి తర్వాత!"

తల అడ్డంగా ఊపింది సాహితి.'నీకు జబ్బు చేస్తే నిన్ను చూడటానికి నీకు మిగిలానని అనుకుంటున్నావు, పిచ్చి తల్లీ! అలా భ్రమపడకు! ఆ డబ్బే నిన్ను చూస్తుంది!' అని మనసులో అనుకుని, పైకిమాత్రం

"వద్దమ్మా, మీ అల్లుడు డబ్బు పంపిస్తానన్నారు .... తననే ఖర్చుపెట్టనీ!" అంది సాహితి.

"నన్ను పరాయిదాన్ని చేస్తున్నావే?" తొలిసారిగా ఈ ఆరునెలల్లో గుండె చెమర్చి కన్నీరు కార్చింది వైశాలి.

"అమ్మా! నిన్ను మేము పెళ్లయిన మరుక్షణమే పరాయిదాన్ని చేశాము. మేమూ పరాయివాళ్లంగా మిగిలిపోయాము. ఇప్పుడు కొత్తగా చేసేదేముంది? కనీసం ఈ డబ్బైనా నీకు మిగలనీ, నిన్నది కాపాడుతుందని అలా అన్నాను. మరోలా అనుకోకు!" సాహితి కళ్లు తుడుచుకుని రిక్షా ఎక్కింది.

పెళ్లగించుకుని వచ్చే ఏడుపును ఆపుకుంటూ కూతురు పక్కన కూర్చుంది వైశాలి. "అమ్మా! ఆయన వచ్చారు, నన్ను తీసుకెళ్తారుట...."

"నిన్ను తీసుకెళ్తాడా? అప్పుడేనా? కానుపై నెలరోజులైనా కాలేదు!"

"ఏమో, రమ్మంటున్నారు."

"వెళ్లిపోతావా?"

తల్లి జాలి చూపులకు తట్టుకోలేక 'ఉంటానమ్మా!' అని చెప్పలేక తల వంచుకుంది సాహితి.

"మూడో నెలలో పంపిస్తానని చెప్పు, సాహితీ!"

"ఇక్కడ ఆయన కూతురికి అన్నీ సలక్షణంగా జరగవట!"

తుళ్లిపడింది వైశాలి. ఆరు నెలల వెనక్కి ... ఆ విరక్తిలోకి వెళ్లిపోయింది వైశాలి. 'ఎంత నిర్దయురాలీ పిల్ల? ఆ పిల్లాడు ఒకవేళ ఆ మాటన్నా, ఈ ముసలి తల్లికి చెప్పి బాధపెట్టాలా? ఈ ఆరు నెలలూ తన భార్యకు జరిగింది, ఆయన కూతురికి జరగదా? ఆర్థికంగా పేదదాన్నయినా ప్రేమకు పేదరాలిని కాదు కదా?'

"సాహీ! నాలుగు రోజులన్నా ఉండిపోమ్మా! ఇంత హఠాత్తుగా వెళ్తే నేను తట్టుకోలేనే! ఈ పసిదాన్ని వదిలి బతకలేనే!"

"ఆయనకు భోజనానికి ఇబ్బందటమ్మా!"

'ఇన్నాళ్లూ లేని ఇబ్బంది ఇప్పుడు హఠాత్తుగా వచ్చిందా?' నీరసంగా కూలబడింది వైశాలి.

"పోనీ, అల్లుణ్ని ఇక్కడే నాలుగు రోజులుండమను!"

ఆ 'పోనీ' అనే పదంలో సర్వం అర్థమైంది సాహితికి. తల్లికి అల్లుడు ఉండటం ఇష్టం లేదు. కేవలం కూతురి కోసం అల్లుణ్ణి బలవంతంగా ఉండమంటున్న భావం!

"ఆయన ఉండలేరులేమ్మా!"

"ఉండు, నే వెళ్లి అడిగొస్తాను!" లేచింది వైశాలి.

పెళ్లి కొడుకుగా ఈ గడప దాటి, ఆరు నెలల క్రితం ఈ గడపలో అవసరానికిమాత్రం కాలు పెట్టిన అల్లుడు ఈ రోజు గడప అవతలే నిల్చున్నాడు.

"అయ్యో... అదేమిటి నాయనా, లోపలకి రా! అక్కడే నిల్చుండిపోయావే?"

"ఫర్వాలేదు, వెళ్తాం... సాహితిని రమ్మనండి!"

నువ్వూ నాలుగురోజులుండి వెళ్లకూడదూ, నాయనా?"

"ఈసారి వస్తాను."

తల్లి భర్తల ముచ్చటైన సంభాషణ వింటున్న సాహితి, తన భర్త పాటించిన సభ్యతకు సంతోషపడింది. ఇంకొక మాట అమ్మ మాట్లాడితే అతడు సభ్యత గీటు దాటతాడు. అది తెలిసిన సాహితి తొందరగా బయటకొచ్చింది.

"అమ్మా! నువ్వు వెళ్లి పాపకేం కావాలో చూడు!" అని తల్లిని పంపేసి భర్తతో అంది "పోనీ, ఇన్ని రోజులు ఉన్నాను, అమ్మ నాలుగు రోజులు ఉండమంటోంది. ఉండి వెళ్దాం!"

"నువ్వు ఉంటే ఉండు, నేను వెళ్తున్నాను!"

ఆయన ఆ మాట ప్రసన్నంగా అనలేదు, నిష్ఠూరంగా అన్నారు. ఒకవేళ తను తనతో వెళ్లకపోతే సంవత్సరాల తరబడి సాధించగల సమర్థుడు. తను వెళ్లక తప్పదు. అయినా ఇంకో ప్రయత్నం చేసింది.

"పోనీ, పాపని ఉంచేసి వెళ్దాం, రెండురోజుల తర్వాత వచ్చి తీసుకెళ్దాం!"

"పాపం ఖర్మ, నువ్వూ ఉండిపో! ఎల్లకాలం ఉండిపొండి! నీకు మొగుడెందుకు? అమ్మ ఉంటే చాలు!"

ఎలా మాట్లాగలరు ఇలా? ఇంత నిస్సంకోచంగా, నిర్లజ్జగా.... నిరాటంకంగా....? అతనికి తెలియదా తను అమ్మను కాదనుకుని రెండేళ్లగా ఈ ఇంటికి రాని సంగతి. తనే తనని తీసుకొచ్చి తన తల్లి దగ్గర విశ్రాంతి కోసం వదిలి వెళ్లిన సంగతి ...! ఆ సంగతులన్నీ తమ ఇద్దరికీ తెలుసు-కదా? మరి ఎలా మాట్లాడగలుగుతున్నారీయన!

### అమాయకురాలు

"ప్రేయసీ...నువ్వు ప్రేమించిన మొదటివ్యక్తిని నేనేనా?" అని అడిగాడు ఆనందరావు అనంతలక్ష్మి కన్నులలోకి చూస్తూ.

"నిజమే...మిగిలినవా రందరూ ఒట్టి కుర్రకారు" అని అమాయకంగా జవాబిచ్చింది అనంతలక్ష్మి.

-కె.ఆర్.కె. మోహన్, హైదరాబాదు

'ఏది ఏమైనా తను వెళ్లి తీరాలి. ఆయన తనని వదిలేస్తే ఒకవేళ అమ్మ తనని డొక్కల్లో పెట్టుకో వచ్చు కానీ, ఆ తర్వాత ఈ సమాజం తనని రక్షించదుగా?

ఈ సత్యం తెలిసిన సాహితి మరి మాట్లాడలేదు.

"కూతుర్ని ఇంట్లో ఉంచుకోవాలనుకున్నప్పుడు అల్లుణ్ణి మర్యాద చేయాలనే సంగతి మీ అమ్మకు తెలియాలి!"

బిత్తరపోయి చూసింది సాహితి. ఈ నాలుగు నిమిషాల్లో ఈ ఇంటిఅల్లుడికి ఏమి అమర్యాద జరిగిందనీ! తను చూస్తూనే ఉంది కదా!

అర్థం విడమరిచి చెప్పారు అల్లుడు హృదయంలో "ఆరోజు నిన్ను ఇక్కడ దిగబెట్టి 'వెళ్లివస్తానత్తయ్యా!' అంటే, 'అలాగే, నాయనా!' అని పంపేస్తుందా? ఓ పూట అల్లుడికి అన్నం పెట్టే గతి కూడా మీ అమ్మకు లేదా?"

ఈసారి దిమ్మెరపోయింది సాహితి.

ఆరోజు ఆర్నెల్లక్రితం ఆ రోజు ....

ఆరోజు తను కూడా అంత పట్టించుకోలేదు. కూతురు వచ్చిన ఆనందంలో అమ్మ, అమ్మను బతిమాలుకునే తరుణంలో తనూ ఆ విషయమే పట్టించుకోలేదు. నిజమే! అప్పుడు ఉండమని అనకపోవడం తప్పే కానీ, ఈ ఆరునెలల్లో ఒక్క జాబులోనైనా ఆ విషయం ఎందుకు రాయనట్టు?

ఇంత అవకాశవాదా తన భర్త? ఆరు నెలలక్రితం అప్పుడు తను అమర్యాద చేయబడి తన మనసు గాయపడినప్పుడే అడగాల్సిన విషయాన్ని తన స్వప్రయోజనం కోసం తన ఛండాలపు మనసులో దాచుకుని ఇప్పుడు దాన్ని వెళ్లగక్కుతున్నారా?

'ఓ భర్త మహాశయా! నీకు జోహార్లు!' భర్తవైపు అసహ్యంగా చూసింది సాహితి.


ఓ మూల కూర్చుని పొత్తిళ్లలో ఉన్న మనవరాలిని గుండెలకత్తుకుని విచారంగాఅల్లుడి సమ్మతికోసం ఎదురు చూస్తూ పశ్చాత్తాపపడుతోంది వైశాలి.

ఆరోజు తన బిడ్డ వచ్చి వాకిట్లో నిల్చుని తనని మాతృమూర్తిని చేయమని అర్థించినప్పుడు తనలో రెండేళ్లుగా ఘనీభవించిన ప్రేమ కరిగిపోకముందు తను అడగాలనుకుంది 'అలాగే, నిన్ను ఈ ఆరు నెలలూ కడుపులో పెట్టుకుంటాను. నీ కడుపులో బిడ్డ ఈ భూమ్మీద పడ్డాక ఆ బిడ్డమీద అధికారం కొద్దిగా నాకిస్తావా, చెప్పు! అలా ఇచ్చే పనైతే చెప్పు, నేను కాలు కిందపెట్టకుండా ఈ ఆరు నెలలు సాకుతాను!'

కానీ అలా అడగలేదు. కారణం పూర్తిగా బిడ్డమీద ప్రేమవల్ల కాదు, తన సంస్కారం ఆ మాట అడగనియలేదు. ఆ రోజు ఆ మాట తను అడిగి ఉంటే, అల్లుడు తలనితీసి ఎక్కడపెట్టుకుంటాడు?

విరక్తిగా నవ్వుకుంది. అతనికేం, ఏ ఎండకాగొడుగు పట్టగల సమర్థుడు.

ఆమె తన ఒళ్లో ఇరవై ఒక్కరోజులు ఎదిగిన పసిగుడ్డును పదే పదే ముద్దుపెట్టుకుంది. ఆ పదిహేడు రోజుల పసిగుడ్డుమీద ప్రేమ ఆమెను




పిచ్చిదాన్ని చేస్తోంది.

భర్త పట్టుదల తెలిసి ఇక క్షణం కూడా ఆగలేదు సాహితి. లోపలకెళ్లి బట్టలన్నీ సర్దుకుని తల్లి దగ్గరకొచ్చింది.

"అమ్మా! నన్ను క్షమించు. జీవితాంతం క్షమిస్తూనే ఉండు. నేను సగటు ఆడపిల్లను. నా భర్త అయోగ్యుడు. కానీ నా జీవతం అతనితోనే తెల్లవారాలి. అలా అని ఈ మంగళసూత్రం చెప్తోంది. ఈ సమాజం చెప్తోంది. ఆఖరుకు నువ్వు చెప్పేదీ అదే ....! వస్తానమ్మా!"

ఆరు నెలల తర్వాత తన మనసు తెరిచి త్రిలముందుపరిచి కన్నీళ్లతో మనసుని కూడా ప్రక్షాళనం చేసుకుని, కారెక్కింది సాహితి.

వాకిటి దాకా నడిచివెళ్లడానికి వైశాలి కాళ్లలో శక్తిని వెళ్లిపోయిన మనుమరాలు తీసుకెళ్లిపోయింది. పిచ్చి కాకచోపే, ఓ సంవత్సరం క్రితం ఆ పసిగుడ్డు తనకు తెలియదు. తనకు లేదు. అయితా తను బతకలేదూ! ఏమిటీ మనసు? తనకు లేనిదానికోసం, దొరకని దానికోసం ఎందుకిలా వెంపర్లాడుతోంది. ఎలా? ఎలా బతకాలి.... ఆ పసిగుడ్డు లేకుండా ఎలా బతకాలి? ఎందుకు బతకాలి?

హఠాత్తుగా ఆమెకు జవాబు దొరిగిన సంతోషం. అసలు సాహితి ఈ వాకిట్లోకి రాకపోతే ఆ రోజే కాలి బూడిదైపోవాల్సిన శరీరం ఇది. ఈ శరీరంలో ఈ మనసొకటి....! వెధవ మనసు.... దానికి ప్రేమ కావాలి. ఆప్యాయతలు రావాలి.... ఛీ! ఈ పాడు శరీరమే లేకపోతే, ఇంత నరకయాతన పెడుతున్న మనసే ఉండదుగా! ఆమె మరొక్కసారి నిర్ణయించుకుంది. త ఘనమైన అల్లుడికి మరొక్కసారి తనతో అవసరం రాకముందు ఈ శరీరాన్ని చాలించాలి. లేకపోతే, తనని ఈ ప్రేమబంధం బతికించి చంపుతుంది. హఠాత్తుగా ఆమె కాళ్లల్లోకి కొన్నివేగన్ల శక్తి వచ్చింది. లేచి వెళ్లి, పెట్టి అడుగున పారేసిన గార్డినాల్ మాత్రలు తీసింది.

ఆమెకు కొడుకులు, కోడళ్లు, మనుమలు, కూతురు, తన ప్రేమను దోచుకున్న మొన్నటి పసికందు.....వీళ్లందరూ గుర్తుకు రాలేదు. చేతిలో మాత్రలు కడుపులోకి పోయాయి. చాలా రోజుల తర్వాత నిశ్చింతగా పడుకుందామె. ఈ మధ్యకాలంలో ఏ రోజూ అంత హాయిగా పడుకోలేదామె. ఇద్దరు కొడుకులు, ఒక కూతురుచేత పరాభవించబడిన ఆమె ఏరాత్రీ సుఖంగా నిద్రపోలేదు.

నిద్ర పడుతుందో పట్టదో అనే దిగులుతో కొంతసేపు తపించినా, నిద్రపట్టక మరికొంతసేపు తరివేస్తున్నా తననల్లుకుంటున్న ఆలోచనలతో ఇంకొంతసేపు.... ఏ అర్ధరాత్రికో నిద్ర పడితే, ఆ నిద్రలో సైతం కన్నబిడ్డల కలలు. ఆశతో ఆకాంక్షతో కలవరంగా లేస్తే నిరాశతో, నిక్షిప్తమైన పరాజయ ప్రేమతో, మరి నిద్రరాకపోవడం. ఎప్పుడు తెల్లవారుతుందా? అని ఎదురు చూడడం .... ఇదీ ఆమె నిద్ర. ఆ రోజు ఆ భయం లేదు. కడుపులోకెళ్లిన గార్డినల్ మాత్రలు ఆశ నిరాశలను పట్టించుకోవు. కిరాతకంగా తల్లి ప్రేమను మరిచిపోయిన బిడ్డల తాలూకు గుర్తుల్ని దగ్గరకు రానీవు. మరు నిమిషమో, మరో నిముషమో .... ఈ బాధల నుంచి ఈ అవమానాల నుంచి బతుకు పోరాటంనుండి అసలెలా బతకాలి అనే ప్రశ్న నుంచి శాశ్వత విముక్తి కలిగించే శాశ్వత నిద్రలోకి వెళ్తోందామె ... చావు సమస్యకు పరిష్కారం కాకపోవచ్చు కానీ శూన్యం కంటే చావు మేలు ...!

బతకడానికి మార్గం చూపించని మనకు ఆత్మహత్య తప్పని చెప్పే హక్కు లేదు!

000

**తమకోసం కొవ్వొత్తిలా కరిగిపోయే తల్లిదండ్రులకు మనం ఇవ్వాల్సింది చనిపోయాక కొరివి కాదు. బతికున్నప్పుడే మీకు మేము ఉన్నామనే భరోసా'! అలాంటి భరోసా ఇచ్చి తల్లిదండ్రులకు ప్రశాంతమైన శాశ్వత నిద్రని ప్రసాదించే అరుదైన బిడ్డలకు ....** ■